# మెరవణి

పగలంతా పొలం పనికెళ్ళి సాయంత్రం ఆలస్యంగా ఇంటికొచ్చిన నరసమ్మ హడావిడిగా ఇల్లూ వాకిలీ అలుకుతోంది. పూరింట్లో పొయ్యి మీద బియ్యం ఉడుకుతోంది. పగలంతా పని చేసిన అలసట, ఇంట్లో పని కాలేదన్న ఆతురత ఆమె ముఖంలో ప్రస్ఫుట మవుతున్నాయి.

ఆ రోజు 'పటమ్మెరవణి'.

వీధిలో డప్పుల శబ్దం, ప్రజల కోలాహలం ఆమె తొందరని ఇంకా ఎక్కువ చేస్తున్నాయి.

ఒక చేతిలో ముగ్గుచిప్ప పట్టుకొని, మరో చేత్తో ముగ్గుపిండిని చిప్పలోనుంచి తీసుకుని... వంగి ముగ్గేస్తున్న నరసమ్మను చూస్తుంటే ఏ శాపవశాత్తో ఆ పల్లెలో అవతరించిన మహాలక్ష్మిలా అనిపిస్తోంది.

ముగ్గు చిప్ప పట్టుకున్న ఎడమ మోచేయిని మోకాలిపై అన్చి, కళ్ళకు అడ్డు వస్తున్న వెంట్రుకల్ని కుడిచేతి ముంచేతితో ఎగదోసుకుంటూ ముగ్గు వేస్తోంది నరసమ్మ.

అదే సమయంలో రొప్పుకుంటూ అక్కడికొచ్చింది పక్కింటి చెంగమ్మ. ఆమె రాకను గమనించిన నరసమ్మ పైకి లేచి "ఏం కొంప మునిగిందే... అట్టా రొప్పతా వచ్చినావ్?" అని అడిగింది.

"మీ అయన్ను, నీ బిడ్డనూ పల్లోళ్ళు కొట్టేస్తావుంటే నువ్వింకా యీన్నే ఉండావా?" ఆయాసపడిపోతూనే అసలు విషయం చెప్పింది చెంగమ్మ.

ఆ మాట విన్న నరసమ్మ ప్రాణం పైనే పోయినట్లనిపించింది. చేతనున్న ముగ్గు చిప్పను అక్కడే పడేసి "ఏం జరిగిందే తల్లీ?" అని ప్రశ్నించింది.

"పటమ్మెరవణి కాడ తగాదా వచ్చింది... ఎగవీధోళ్లు, దిగవీధోళ్లు కొట్టుకుంటా ఉండారు..." ఈసారి నిదానంగానే చెప్పింది.

"వోళ్ళ ముండమొయ్యా! వోళ్ళ తాడు తెగా! వోళ్ళ కేం పొయ్యేకాలమే తల్లీ! వోళ్ళ చేతులిరగా!." నోటికొచ్చినట్లు తిట్టుకుంటూ వీధిలోకి వచ్చింది నరసమ్మ.

వీధిలో అంతా గందరగోళం! ఒకటే గలాటా!

అందర్నీ తోసుకుంటూ వెళ్ళి రక్తపు మడుగులో పడి ఉన్న భర్తనీ, కొడుకునీ చూసింది నరసమ్మ. ఆమె గుండె ఆగిపోయినట్లనిపించింది.

"అయ్యో! నేనేం జేసేదిరో దేవుడో...ఎవురి పాంపెరికిందిరో దేవుడా!" వాళ్ళ మీద పడి విలపిస్తోంది. ఊర్లో ఆడవాళ్ళు ఆవేదనగా చూస్తున్నారు. అంత వరకూ దుడ్డు కర్రలు చేతబట్టుకొని వాళ్ళని కొట్టిన వారిలో కొందరు, ఆమె ఏడుపును చూసి అప్పటికే అక్కడి నుండి జారుకున్నారు. కొందరు అలాగే నిలబడి ఉన్నారు. కొందరు చెంబుతో నీళ్ళు తెచ్చి స్పృహలో లేని నరసమ్మ భర్త

రంగన్న ముఖాన నీళ్ళు చల్లి ఉపచర్యలు చేస్తూ తిరిగి అతను స్పృహలోకి రావడానికి ప్రయత్నం చేస్తున్నారు. అతని తలపైన పెద్ద గాయమై రక్తం ఓడుతూనే ఉంది. అతని శరీరమంతా దెబ్బలే. ఆ పక్కనే అతని ఆరేండ్ల కొడుకు బాల కిష్టుడు అచేతనంగా పడి ఉన్నాడు. అతని ప్రాణాలు ఎప్పుడో అనంత వాయువుల్లో కలిసిపోయి ఉన్నాయి. అతని పైన పడి నరసమ్మ ఏడుస్తూ ఉంది. గుండెలు బాదుకుంటోంది. కొడుకుని పొట్టన పెట్టుకుని, పెనిమిటిని కొట్టిన వారిని ఆడి పోసుకుంటూనే ఉంది.

"నాగోడు వోళ్ళ కెదగా! నా బిడ్డె ఉసురు వోళ్ళ బిడ్లకు తగలా! వోళ్ళ నెత్తకపాయ్యి బచ్చనకుంట్లో బెట్టా! వోళ్ళ శవాల్ని తిమ్మంచెర్లో బూడ్చా! వోళ్ళ బిడ్ల నెత్తకపాయ్యి కుమ్మరకుంట్లో యెయ్యా! ఇంక నాకు దిక్కెవర్రో దేవుడో. ఇంక నాకు తోడూ నీడా ఎవర్రా దేవుడో?"

భర్తనీ, కొడుకునీ చేతుల్తో ఊపిఊపి ఏడుస్తోంది. గుండె తరుక్కుపోయేలా, కడుపు చెరువయ్యేలా విలపిస్తోంది. అంతులేని ఆమె ఏడుపుకు కారణం ...

❖ ❖ ❖ ❖

కొన్ని ఏళ్ళుగా కరువులతోనూ, కక్షలతోను సతమతమవుతున్న ఆ ఊరువాళ్ళు బాగా వర్షం పడడంతో .. అన్నీ మరచి ఆ ఏడు "పటమ్మోరవణి" చేయాలని నిశ్చయించుకున్నారు. ఇంటికింతా అని పంపకం వేసుకున్నారు. ప్రెసిడెంట్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఆ రోజు పటమ్మోరవణి మొదలైంది. ప్రెసిడెంటుది, వైస్ ప్రెసిడెంట్ వీరయ్యది ఒకే కులం కాదు. వేరువేరు కులాలు. ఆ ఊర్లో వాళ్ళ రెండు కులాలకు సమాన బలం ఉంది. మిగిలిన వాళ్ళు రెండు మూడు కుటుంబాల వాళ్ళున్నా వాళ్ళు పై వాళ్ళలో ఏదో ఒక వర్గానికి చెందినవాళ్ళే... ఒక్క రంగన్న తప్ప. ప్రెసిడెంటు వర్గానికి, వైస్ ప్రెసిడెంటు వర్గానికి పాత కక్షలున్నా శుభ కార్యాలలోనూ, పల్లెకు సంబంధించిన కొన్ని వ్యవహారాల్లోనూ కలిసి పాల్గొంటారు. అది ఆ ఊరి ప్రత్యేకత. అందరూ మనస్పర్థలు మరచిపోయి రాగిమాను కిందున్న రచ్చబండపైన కూర్చోనున్నారు. కొందరు యువకులు 'రాశింటి' ముందున్న 'సత్తెమ్మ' గుడికెదురుగా పల్లకీ కడుతున్నారు. పల్లకీ మధ్యలో సీతా సమేతమై వున్న శ్రీరామ పట్టాభిషేక పటాన్ని అమర్చి, చుట్టూ ఉన్న 'పలగడ'కు అందంగా పూలు అమర్చుతున్నారు. ఇండ్లల్లో ఇల్లాండ్రు స్నాన పానాదులు ముగించుకుని, పసుపు, కుంకుమ, కర్పూరం వంటి పూజా ద్రవ్యాలతోను, నీళ్ళ కడవల తోను సిద్ధంగా ఉన్నారు.

డప్పులు విరామం లేకుండా మ్రోగుతున్నాయి. కురబలు పిల్లం కట్టెలు ఊదుతూ తాళాలు వేస్తూ నర్తిస్తున్నారు. కొందరు కన్నె పిల్లలు గొబ్బితడుతూంటే కొందరు యువకులు చెక్క భజనలు వేస్తూ భక్తి పాటలు పాడుతున్నారు. చిన్న పిల్లలు మాత్రం వాళ్ళ మధ్యనే వేడుగ్గా తిరుగుతూ వాళ్ళ అడుగుల నుంచీ వడుపుగా తప్పించుకుంటూ ఆడుకుంటున్నారు. మొత్తం పల్లెపల్లె వేడుగ్గా హుషారుగా ఉంది. అప్పటికే కర్మసాక్షి కనుమరుగై చాలా సేపైంది. గ్రామదేవతల

గుడులలోను, పల్లకీలోను, ఆ పల్లెలోని ప్రతి ఇంట్లోను దీపాలు వెలుగుతున్నాయి.

భార్య నరసమ్మతోను, తన కొడుకు బాలకిష్టుడితోను ... పొలం పనికెళ్ళి పొద్దుపోయి ఇంటికి చేరుకున్నాడు రంగన్న. ఇంటికి రాగానే తొందర తొందరగా స్నానం చేసి వీధిలో అడుగు పెట్టాడు.

నరసమ్మ వంట పని చేస్తూనే, ముంగిలి అలకటం ప్రారంభించింది. ఇల్లలక్కనే దేవుడొచ్చేస్తాడేమో అని ఆమె భయం. వీథిలో ఆడుకుంటున్న పిల్లలతో ఎప్పుడో కలిసిపోయాడు బాలకిష్టుడు.

అప్పటికే పల్లకీ ఊరేగింపుకు సిద్ధంగా ఉంది. గుడిలోని సత్తెమ్మను వేపాకులతో అలంకరించారు. దాని కెదురుగా ఉన్న త్రిశూలానికి నిమ్మకాయలు గుచ్చారు. ఇక అక్కడ కొబ్బరికాయ కొట్టి మెరవణి పోవడమే తరువాయి. ఆ ఊరి చాకలి ఆచారం ప్రకారం ముందుగా టెంకాయ కొట్టి హారతిచ్చాడు. ఆ మరుక్షణం నేల పైనున్న పల్లకీ యువకుల భుజాలపై కొచ్చింది.

ఒక్కసారిగా అందరూ "గోవిందా! గోవిందా!" అంటూ హరినామ స్మరణ చేశారు. డప్పుల శబ్దం ఒక్కసారిగా తారాస్థాయినందుకుంది. డప్పులవాళ్ళు పీకలదాకా తాగి ఉండడంతో దిక్కూ మొక్కూ తెలీకుండా డప్పులు పగిలే విధంగా కొడుతున్నారు. అలంకరణతో నిండు గర్భిణిలా ఉన్న పల్లకీ యువకుల భుజాల పై వెనక్కీ ముందుకీ భారంగా కదుల్తూ ఒక్క అడుగు ముందుకు కదిలింది. ఆనవాయితీ ప్రకారం 'రాశింటి' వైపు పల్లకి బయలుదేరింది. కోలాహలం మిన్నుముట్టింది. ఆబాల గోపాలం వేడుగ్గా చూస్తున్నారు.

ఆ పల్లెలో ఏ ఉత్సవం జరిగినా మొదట 'రాశింటి' నుంచి ప్రారంభం. ఏ దేవుడైనా మొదట పొందేది రాశింటి నైవేద్యమే. ఏ చందా ఇవ్వాలన్నా, పండుగల్లో పబ్బాల్లో ఏ వేట తెగాలన్నా రాశింటితోనే మొదలు. ఆ తర్వాత ఆ వరుసలోని ఇళ్ళకు ప్రాధాన్యం. ఇది తరతరాల నుంచీ వస్తున్న ఆచారం. అలాగే ఎన్నో సంవత్సరాల నుంచీ ఆ ఊరికి ప్రెసిడెంటు వీరయ్య. ప్రతి తరంలోనూ ఆ కుటుంబీకులే ప్రెసిడెంట్లుగా, సర్పంచిలుగా ఉంటున్నారు. దానికి తగిన ధన బలం, రాజకీయ బలం వారి కుండడమే కారణం. ఇన్ని రోజులూ ఆ గ్రామానికి మకుటం లేని మహారాజు వీరయ్య. కానీ ఈసారి రాశింటి రామచంద్రయ్య ప్రెసిడెంటయ్యాడు. ఆ ఊర్లో వీసమెత్తు అటూ ఇటూ వీరయ్యకు అన్ని విధాలా సరితూగే కుటుంబం రామచంద్రయ్యదే. అన్యాయాలు చేయడంలోనూ, ఆ ఊరి ప్రజల్ని తమ చెప్పు చేతల్లో పెట్టుకోవడంలోనూ, ఎత్తుకు పై ఎత్తులు వేయడంలోనూ రామచంద్రయ్య వీరయ్యకు ఏ మాత్రం తీసిపోడు ... తన సొంత తెలివి తేటలతో ఎలాగో ఓలాగు ఈసారి రామచంద్రయ్య ప్రెసిడెంటు కాగలిగాడు. దాని వెనుక అతని కుల బలం కూడా లేకపోలేదు. అయితే అతని గెలుపు వీరయ్యకు కంటగింపుగానే ఉంది, ఇన్ని ఏళ్ళుగా వస్తున్న ప్రెసిడెంటుగిరీ ఊడిపోయేసరికి. ఒక సామాన్య సిపాయి నడి సభలో

ధైర్యంగా ముందుకు వచ్చి ఎడమ కాలితో తన కిరీటాన్ని నేల పడేటట్లు తంతే బాధపడిపోయే మహారాజులా బాధపడిపోయాడు వీరయ్య. కానీ కాలం కలిసిరాక ఊరుకుంటున్నాడు. అందుకే... ఏ చిన్న అవకాశం చిక్కినా ... దాన్ని ఆసరాగా-చేసుకొని అటు రామచంద్రయ్యను, ఇటు తనకు వ్యతిరేకంగా ఓట్లు వేసి అతన్ని గెలిపించిన అతని కులం వారినీ ముప్పు తిప్పలు పెట్టి ఎదురు దెబ్బ తీయాలని అవకాశం కోసం వేచి ఉన్నాడు. దానికి తోడు ఆ కుటుంబంతో ఉన్న పాతకక్షలు అతని ఆలోచనలకి తోడై అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

అంతే, అతనిలోని అసలు రాక్షసుడు ఆ రోజు మేల్కొన్నాడు. తన కులం వారిని రెచ్చగొట్టాడు. ఫలితంగా వీరయ్య వర్గీయులైన అతని కులం వాళ్ళు "ముందు ప్రెసిడెంటింటి కెందుకెల్లాలి. మా వీరయ్య ప్రెసిడెంటుగా ఉన్నన్ని రోజులూ మొదట తన ఇంటికి ఏ దేవుణ్ణి రానీయలేదు కదా. ఇప్పుడు ఈయన మాత్రం ముందు వాళ్ళింటికే ఎందుకు దేవుణ్ణి తీసకపోవాల. అదేం కుదరదు. ఈసారి వీరయ్య గారింటి నించే దేవుడు మెరవణి రావాల అంతే" అని పట్టుబట్టారు. అనాది నుంచీ వస్తున్న రాశింటి ఆచారాన్ని కాదని వీరయ్య ఇంటికే మొదట దేవుడు వెళ్ళడం రామచంద్రయ్యకు, అతని కులం వాళ్ళకి అసలే గిట్టలేదు. అలా జరిగితే తమ కులం గౌరవం, ప్రతిష్ఠ తలకిందు లవుతాయని వారు భావించారు. దాంతో రామచంద్రయ్య తన కులం వాళ్ళని దానికి విరుద్ధంగా రెచ్చగొట్టాడు. ఇది ఆ ఊర్లో తలెత్తిన మరో కొత్త వైషమ్యం! ఇంతకుముందు వాళ్ళకి చేల గట్ల దగ్గరనో, గొడ్ల దగ్గరనో గలాటాలు వచ్చాయే గానీ, ఇలాంటి వివాదం ఇంతకు ముందెన్నడూ రాలేదు ఇరు వర్గాల వారికి మాటా మాటా పెరిగింది. 'నీవెంత' అని వొకరంటే 'నీవెంత' అని మరొకరనుకున్నారు. జబ్బా జబ్బా చరుచుకున్నారు. అటు వీరయ్య, ఇటు రామచంద్రయ్య కూడా నిలబడ్డారు. చిలికిచిలికి గాలి వానయినట్లు వాళ్ళ కొట్లాట క్షణంలో పోట్లాటగా మారిపోయింది. అదే రాను రాను కుల కక్షగా మారి "మా కులం గొప్ప" అని ఒకరు, "మా కులం గొప్ప" అని మరొకరు అరుచుకున్నారు. ఫలితంగా వాళ్ళ చేతుల్లో దుడ్డు కర్రలు, బండి కూసులు ప్రత్యక్షమయ్యాయి. కులతత్త్వంతో రెచ్చిపోయిన ఆ ఊరు క్షణంలో యుద్ధ రంగంగా మారిపోయింది. తా నంటించిన నిప్పు అలా బడబాగ్నిలా మారడంతో సంతోషంగా నవ్వుకున్నాడు వీరయ్య.

చేయీ చేయీ కలుసుకున్నాయి. కర్రా కర్రా కొట్లాడుకున్నాయి. కొందరికి కాళ్ళిరిగితే మరికొందరికి చేతులిరుగుతున్నాయి. కొందరికి నడుములిరుగుతుంటే మరికొందరికి తలలు పగులుతున్నాయి. క్షణంలో అక్కడి పరిస్థితి ఘోరంగా మారిపోయింది. పక్కనే నేలకు దించేసి ఉన్న పల్లకిలో వున్న దేవుని పటం మౌనంగా చూస్తూనే ఉంది.

కొందరు ఆడవాళ్ళు కూడా పచ్చి బూతులు తిడుతూ ఆ రగడలో కలిసిపోయి తమ మగవాళ్ళ పలికి బాసటగా నిలుస్తున్నారు. కొందరు ముసలి వాళ్ళు శాంతికాముకు "ఆపండీ! కొట్లాట వద్దు. శాంతించండీ!" అని గొంతు చించుకొని అరుస్తూ ఆ రగడను ఆపడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ ఎవ్వరూ వారి మాట వినిపించుకునే స్థితిలో లేరు.

రంగన్న అక్కడ కొట్లాడుకుంటున్న రెండు కులాలలో ఏ కులానికి చెందినవాడు కాదు. ఏ వర్గంలోని వాడూ కాదు. అందుకే వాళ్ళ రగడను నివారించడానికి ప్రయత్నిస్తున్నాడు. మరోవైపు ఆ దొమ్మీలో తొక్కిళ్ళకు, దెబ్బలకు గురవుతున్న పసి పిల్లల్ని తప్పిస్తున్నాడు.

ఆ గుంపు ... ఘోరంగా దుడ్డు కర్రలతో బండి కూసులతో బాదుకుంటుంటే ... ఏ ఇల్లాలి కంట్లో కన్నీ రొలుకుతోందో, ఏ పసి హృదయం పై ఆ సంఘటన ఎలాంటి రాక్షసముద్రను వేస్తోందో ఎవరూ గమనించడం లేదు. ఆ గుంపు మధ్యలో ... ఏ క్షణాన ఏ దెబ్బకో, ఏ పాదఘాతానికో గురికావడానికి సిద్ధంగా వున్న బాలకిష్టుడితో బాటు మరికొందరు పిల్లలు రంగన్న కంటపడ్డారు.

"బాలూ" అరిచాడు రంగన్న.

ఆ రగడలో ఆ శబ్దం అతనికే వినిపించలేదు. అక్కడ ... అరుపులు కేకలు తిట్లు, శాపనార్థాలు, బూతులే తప్ప కేకలు వినిపించడం లేదు. అలాంటి పరిస్థితిలో బాలకిష్టున్ని, ఆ పిల్లల్ని ఎలా రక్షించాలో రంగన్నకు పాలుపోవడం లేదు. అక్కడెవరికీ కొట్టుకుంటున్న వాళ్ళ మధ్య పిల్లలున్నట్లు కూడా అనిపించడం లేదు. చుట్టూ చూశాడు రంగన్న.

సత్తెమ్మ గుడి ముందట త్రిశూలం వెక్కిరిస్తూ కనిపించింది. అమాంతం దాన్ని చేతిలోకి తీసుకుని గుంపులో జొరబడ్డాడు. రంగన్న ఆ సమయంలో ప్రళయరుద్రుడే అయ్యాడు. దక్షయజ్ఞం ధ్వంసం చేయడానికి బయలుదేరిన వీరభద్రుడిలా, పద్మవ్యూహాన్ని ఛేదించబోయే వీరాభిమన్యుడిలా వారితో కలబడ్డాడు. అలా కలబడి తిన్నగా వెళ్ళి తన కొడుకుని రక్షించుకోవాలని అతని ఆతురత. ఎదుటివారి కర్ర దెబ్బలు తనకు తగలకుండా త్రిశూలం అడ్డు పెట్టుకుంటూ ముందుకు పోతున్నాడు రంగన్న. ఇప్పుడు రంగన్నకు కులాలతోను, వర్గాలతోను, వాళ్ళ కక్షలతోను సంబంధం లేదు. అతని దృష్టంతా కొడుకుపైనే. అయితే ...చదరంగం ఆడుతూ ఆనందించే జూదగాళ్ళలా, కోడిపుంజుల్ని చుట్టి పందెం కాసి ఆనందించే పందెగాళ్ళలా, ఆ దొమ్మీని చూస్తూ మనసులోనే ఆనందపడి పోతున్న ప్రెసిడెంట్లిద్దరూ ఆదొమ్మీ మధ్యలో త్రిశూలం తిప్పుతూ పోతున్న రంగన్నను చూడనే చూశారు. రంగన్న ఎవరివైపు ఎవరికోసం పోరాడుతున్నాడో వాళ్ళకి తెలీడంలేదు. రామచంద్రయ్య వర్గం వాడని వీరయ్య, వీరయ్య వర్గం వాడని రామచంద్రయ్య అనుకున్నారు. అంతే ... వీరయ్య తన వర్గంలోని ఒకర్ని పిలిచి ... "వరే! వీడు వాడి మనిషిలాగున్నాడు... యేసెయ్యండి" అని పురమాయించాడు. అలాగే రామచంద్రయ్యా తన వర్గంలోని ఒకర్ని పిలిచి "వరే! వీడు వాడి మనిషిలా వున్నాడు. మనోళ్ళనే కొడతా ఉండాడు. వాడి కత చూసుకోండి" అన్నాడు. దాంతో ఇరు వర్గీయులూ రంగన్నను చుట్టుముట్టారు. అన్ని దుడ్డు కర్రలూ ఒక్కసారిగా పైకి లేచాయి. మరుక్షణమే అతని చేతిలోని త్రిశూలం వంగిపోయి అతని తల నుంచీ రక్తం స్రవించింది.

"బాలూ" అంటూ ఒక్క కేక వేసి ఒక అంగలో కొడుకును ఎత్తుకున్నాడు రంగన్న. మళ్ళీ కొన్ని దుడ్డు కర్రలు ఆ రెండు శరీరాల్ని ముద్దు పెట్టుకున్నాయి. అలా మళ్ళీ ... మళ్ళీ ... మళ్ళీ!

కొంత సెపటికి బాలకిష్టుడితో బాటు రంగన్నా విలవిల తన్నుకుంటూ నేల కొరిగిపోయాడు.

విషయం తెలుసుకున్న నరసమ్మ గుండెలు బాదుకుంటూ అక్కడికి వచ్చింది ... అందరికీ శాపనార్థాలు పెడుతోంది.

ఆ సంఘటనతో అందరూ దొమ్మీ చాలించి తాము చేసిన పొరబాటుకు తలలు వంచుకుని నిలబడ్డారు.

నర్సమ్మ పైకి లేచి తన చేతికంటుకున్న రంగన్న రక్తం చూసింది. అందరూ ఆమెనే చూస్తున్నారు.

ఆ రక్తాన్ని తన చేతికి పూసుకుంది. ముఖానికీ పూసుకుంది. ఎదరొమ్ముకూ పూసుకుంది. పిచ్చిపిచ్చిగా అరవసాగింది.

"వరే! ముండనాకొడుకుల్లారా! ముండనా సవతుల్లారా! మీ కులాలు తగలబడా! కులం కులం అని కుమ్ములాడుకోని మీ కులం కాని మమ్మల్ని సంపినారు గదా! వరే ఇప్పుడు సూడంట్రా మీ కులాలు వేరు. మా కులం వేరు. అందరి రక్తం ఒకటే. అందరికులాల్లో వుండే రక్తమూ ఒక్కటే. అది ఎర్రగానే ఉంటాది. దాని వర్ణం ఎరుపు చూడండీ." తన వంటి కంటుకున్న రక్తాన్ని చూపించింది. ఇంకా ఆవేశంగా చెప్పుకుపోతోంది నరసమ్మ.

"వరే ఈ మడుసుల్లో ఉండేదంతా ఎర్ర నెత్తురే. కానీ ఈ మడిసి సేసిన ఈ కులాల వర్ణాలు మాత్రం వేరే. ఏ వరణమైతే ఏమిరా? అందరూ బతికేది ఈ భూమి పైన్నే .... అందరూ జీవనం గడపతా వుండేదీ జానెడు పొట్టకోసరమే. ఛీ ... మీ ముండలమొయ్యా! ఇది తెలీక కొట్లాడు కోని సస్తారంట్రా ... తుపుఁ .... "

నేల మీద ఉమ్మింది ... అందరి హృదయాలు ద్రవించిపోతున్నాయి. అందరి మనసుల్లోనూ పశ్చాత్తాపం మొలకవేసింది. అయినా నరసమ్మ ఇంకా తిడుతూనే ఉంది.

"వరే! ఇందాకా మీ దేవున్ని మెరవణి జేసినారు. ఇంక నా బిడ్డను మెరవన్జేయండ్రా! వరే! వరే!! ఇందాకా ఆ దేవుడికి పుష్ప పల్లకీ కట్టారు గదరా? ఇంక వీడికి పాడె కట్టండ్రా .... కట్టండీ! ఎందుకంటే ... వీడు మీ కక్షలకి బలైపోయిన బాలదేవుడ్రా ... నా బిడ్డ బలై పోయిన బాల దేవుడ్రా ... బాలదేవుడు." ఆమె ఇంకా అలాగే పిచ్చిగా అరుస్తూనే ఉంది. వెర్రిగా ఏడుస్తూనే ఉంది.

ఆమె మాటలకెవరూ సమాధానం చెప్పలేదు. ఆమె శాపనార్థాలూ, ఏడుపూ ఆపనే లేదు. ఆమెది అంతులేని దుఃఖం అందుకే అందరి కళ్ళు అవమానంతో చెమర్చాయి.

అక్కడ! ... ఒక పక్క కనిపించని దేవుడికి పూలపల్లకీ కట్టి ఉంది. మరో పక్క ... కులాల కురుక్షేత్రంలో శవంగా మారిన బాలకిష్టుడికి పాడె కట్టబడింది.

అక్కడ ... దేవుడి మెరవణి ఆగిపోయింది. ఇప్పుడు బాలకిష్టుడి మెరవణి బయలుదేరింది. అటు వైపు పల్లకీ!! ఇటు వైపు పాడె!!

• *18-7-1990 - ఆంధ్ర ప్రభ, వార పత్రిక* •